క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతులు కారణంగా శుక్రవారం సరూర్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆదర్శనగర్ ఫీడర్ పరిధిలోని నాగోలు మూసీ ప్రాంతం అల్కాపురి, సిగ్నం ప్రధాన రోడ్డు, ఆదర్శనగర్ రోడ్ నం–1, 2, అరుణోదయనగర్ రోడ్ నెం –1–8 పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు. 11కేవీ టీ.ఎస్.హౌసింగ్ బోర్డు ఫీడర్ పరిధిలోని ఇందు అరణ్య అపార్ట్‌మెంట్స్, ఇందు అరణ్య విల్లాస్ పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

మీడియా కమిటీ చైర్మన్‌కు సన్మానం


రాజును సత్కరిస్తున్న నాయకులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల ఆర్య వైశ్య మహాసభ మీడియా కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రాజుగుప్తాను మహేశ్వరం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు నగేష్ గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏ బాధ్యతలు చేపట్టినా ఆ పదవికి వన్నె తెచ్చే విధంగా పనిచేయాలని సూచించారు. రాజుగుప్తా భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. పేదల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో లింగస్వామిగౌడ్, శ్రీనివాస్, శేఖర్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, రమేష్, దేవేందర్, జగన్‌గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సుల్లో తనిఖీలు


మాల్ చెక్‌పోస్టు వద్ద ఆర్టీసీ బస్సులో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ వెంకటనారాయణ

యాచారం: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. మాల్ చెక్‌పోస్టు వద్ద గురువారం యాచారం ఎస్ఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో సాగర్ రోడ్డుపై రాకపోకలు సాగించే కార్లు, ఇతర వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సుల్లోని ప్రయాణికులను తనిఖీలు చేశారు. ఆర్టీసీ బస్సుల్లో వెళ్తున్న ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగుల్లో తనిఖీలు చేశారు. షెడ్యూల్ ప్రకటనతోనే ఇలా తనిఖీలు చేస్తే ముందు మరేలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రూ.లక్షకు మించి నగదు తీసుకెళ్లాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి ఉంది.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ యాదిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న యాదిరెడ్డి

ఇబ్రహీంపట్నం: గ్రామగ్రామాన సీపీఐని బలోపేతం చేయాలని ఆ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కన్వీనర్ యాదిరెడ్డి అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యాదిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా సమష్టిగా ఎమ్మెల్యే అభ్యర్థికి మద్దతునిచ్చి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నర్సింహ, నీలమ్మ, యాదయ్య, సంజీవ, రాజునాయక్, కృష్ణ పాల్గొన్నారు.

రూ.5,43,000 స్వాధీనం

మహేశ్వరం: మండల కేంద్రంలోని అంబేద్కర్–జగ్జీవన్‌రామ్ చౌరస్తా వద్ద గురువారం రాత్రి మహేశ్వరం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో రూ.5,43,000 పట్టుకున్నారు. వివరాలు.. కందుకూరు మండలం బేగంపేట్ గ్రామానికి చెందిన మాదారం శ్రీనివాస్ కోకాకోలా కూల్‌డ్రింక్ డిస్ట్రిబ్యూటర్‌గా వ్యాపారం చేస్తున్నాడు. గురువారం రాత్రి దుకాణాల నుంచి పాత బాకీలను వసూలు చేసుకొని తన కారులో మహేశ్వరం గేటు వైపు వెళ్తుండగా పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఏలాంటి బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న రూ.5 లక్షల 43వేల నగదును సాక్షుల సమక్షంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం కందుకూరు ఆర్డీఓకు నగదును అప్పగించామని మహేశ్వరం సీఐ మునిపేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున్న ఎలాంటి బిల్లులు లేని నగదును సీజ్ చేస్తున్నామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నర్సయ్య, రవీందర్, సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


మీర్‌పేట: బతుకమ్మలతో విద్యార్థినులు


బడంగ్‌పేట్: బతుకమ్మ సంబురాల్లో ఉపాధ్యాయులు, చిన్నారులు


కందుకూరు: బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

బడిలో బతుకమ్మ సందడి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్‌లోని రవీంద్రభారతి స్కూల్‌లో గురువారం బతుకమ్మ పండుగ వేడుకలను వైభవంగా నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాలలో బతుకమ్మ ఆడారు. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కుముదవల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: మండల కేంద్రంలోని నోబుల్ స్కూల్‌లో బతుకమ్మ పండుగ సంబురాలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు బతుకమ్మ ఆటలు ఆడి సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొండల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, డ్యాన్స్ మాస్టర్ గోవింద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడంగ్‌పేటలో..

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని లార్డ్స్ ఒలంపియాడ్ స్కూల్‌లో గురువారం బతుకమ్మ సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

రీజియన్ బ్యాంక్ మేనేజర్ రమణారెడ్డి

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు, నాబార్డు సంయుక్త ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రీజియన్ బ్యాంక్ మేనేజర్ రమణారెడ్డి హాజరై మాట్లాడుతూ.. సంఘం సభ్యులు సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా, సురక్షబీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంక్ ద్వారా గోల్డ్ లోన్లు, ముద్ర లోన్లు, బిజినెస్ రుణాలు ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ కిషన్, ఫీల్డ్ అధికారి సాయివర్షిత, ఆర్‌పీలు మంగ, సరిత, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

సంఘం సీనియర్ నేత జయేందర్‌ముదిరాజ్


జయేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కందుకూరు: మండల కేంద్రంలోని ముదిరాజ్ భవనంలో అదనపు గదుల నిర్మాణానికి గాను మండల పరిధిలోని దాసర్లపల్లికి చెందిన ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకుడు కుర్నమోని జయేందర్‌ముదిరాజ్ తన సొంత డబ్బు రూ.10 లక్షలు ఆ సంఘం నిర్వాహకులకు అందజేశారు. దీంతో గురువారం ఆయన్ని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కాకి దశరథ, ఎడ్ల బాబురావు, ఎంపీటీసీ కాకి రాములు, డైరెక్టర్ పాండు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తాము కోరిన వెంటనే ఆర్థిక సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జయేందర్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అందరూ కలిసికట్టుగా ఉండి హక్కులను సాధించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మల్లేష్, జి.యాదయ్య, ఎ.నర్సింహ, పి.జంగయ్య, అంజయ్య, సురేందర్, శ్రీధర్, జంగయ్య, నర్సింహ, బాల్‌రాజు, సుదర్శన్, రాజ్‌కుమార్, రాములు, నరేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా ధర్నా విరమిస్తున్నాం

- బండరావిరాల మైనింగ్‌జోన్ భూ నిర్వాసితులు
- 422రోజుల పాటు కొనసాగిన ధర్నా
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొనసాగిస్తామని వెల్లడి


ధర్నాకు దిగిన మైనింగ్ జోన్ భూ నిర్వాసితులు (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని బండరావిరాల మైనింగ్ జోన్ కోసం సర్వేనంబర్ 268లోని 1050 ఎకరాల భూమిని కోల్పోయిన బండరావిరాల, చిన్నరావిరాలకు చెందిన నిర్వాసిత రైతులు తమకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గత 422 రోజులుగా చేస్తున్న ధర్నాను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. తమ నుంచి లాక్కున్న భూమికి బదులుగా భూమిని లేదా నష్టపరిహారం చెల్లించడంతో పాటు తమ గ్రామంలో ఏర్పాటు చేసిన మైనింగ్ జోన్‌ను ఎత్తివేయాలని అలాగే కొత్తగా క్రషర్లకు అనుమతులు ఇవ్వకూడదంటూ బాధిత రైతు నేతి క్రిష్ణయాదవ్ ఆధ్వర్యంలో 159మంది రైతు కుటుంబాలు ఏడాదిన్నర క్రితం సద్దుపల్లి కూడలిలో ధర్నాను ప్రారంభించిన విషయం తెలిసిందే. గత 422 రోజులుగా మంత్రులు, ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లినా స్పందించకపోవడం దారుణమని పేర్కొంటున్న రైతులు ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న ఎన్నికల కోడ్ అమలు కారణంగా స్థానిక పోలీసుల సూచన మేరకు ధర్నాను తాత్కాలికంగా ఎన్నికలు ముగిసే వరకూ విరమించుకుంటున్నామని, ఎన్నికల అనంతరం ఏ ప్రభుత్వం వచ్చినా కూడా తమకు న్యాయం జరిగేంత వరకూ తమ ధర్నాను కొనసాగిస్తామని తెలిపారు. రైతులు పావురాల ఐలయ్య, గంగయ్య, యాదగిరి, నరేష్, మణెమ్మ, ఐలమ్మ, వెంకటమ్మ, బాలమ్మ, రైతు కుటుంబ సభ్యులు ప్రకటించారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి


తలకొండపల్లి: ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కసిరెడ్డి తదితరులు

తలకొండపల్లి: కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాంపూర్, సంఘాయిపల్లిలో గురువారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీ పథకాల గురించి వివరించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీ స్కీములను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్వాన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, యూత్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, సోషల్ మీడియా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజీం, మండల ఎస్సీసెల్ చైర్మన్ చెన్నకేశవులు,ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు రమేష్, సీనియర్ నేత కృష్ణ పాల్గొన్నారు.

12వ వార్డులో గడగడపకు కాంగ్రెస్..

ఇబ్రహీంపట్నం: గడప గడపకు కాంగ్రెస్ నినాదంతో ఇబ్రహీంపట్నంలోని 12వ వార్డులో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిచందు ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను రాష్ట్రంలో అమలు పరుస్తారని ప్రజలకు ఆమె వివరించారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కష్టపడి పనిచేవారికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రొఫెసర్ ప్రభాకర్, డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి

మలక్‌పేట: మొక్కలు ప్రకృతి ప్రసాదించిన వరమని, వాటిని పెంచితే అనేక విధాలుగా ఉపయోగపడతాయని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకర్ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ అనిబీ సెంట్ ఉమెన్స్ కాలేజీలో గురువారం కాలేజీ బోటనీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రీన్‌డే' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, మొక్కలు మానవ జీవితంలో ముఖ్యమైన ప్రాత పోషిస్తాయన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మొక్కల ప్రాధాన్యతను వివరించారు. రకరకాల పండ్లు, పువ్వులు, కూరగాయలు, ఔషధ, ఇండోర్ మొక్కల ప్రదర్శన నిర్వహించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కాలేజీ సెక్రటరీ డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, డైరెక్టర్ దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేఖరెడ్డి, బోటనీ డిపార్ట్‌మెంట్ లెక్చరర్ అర్షియ ఆఫ్రీన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి


మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

మంత్రి సబితారెడ్డి

కందుకూరు: తెలంగాణలోని సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి సబితారెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని సార్లరావులపల్లి సర్పంచ్ రజితప్రవీణ్‌నాయక్ ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన పలువురు గురువారం మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి మాట్లాడుతూ.. మహేశ్వరంతో పాటు రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ గెలుపు నల్లేరుపై నడకలాంటిదేనన్నారు. ప్రజలు మరోసారి కేసీఆర్ సర్కార్‌ను బలపర్చి హ్యాట్రిక్ సాధించేలా ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు కృష్ణరాంభూపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు కె.దశరథ, డైరెక్టర్ కె.దేవీలాల్‌నాయక్, మాజీ సర్పంచ్ గోవర్ధన్‌నాయక్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు బాలూనాయక్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి..

మహేశ్వరం: బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే మరోసారి సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా గెలిపిస్తాయని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పెండ్యాల గ్రామానికి చెందిన పలువురు గురువారం మంత్రి రాజేశ్ ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి వివిధ పార్టీల నాయకులు పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నేతలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మహేశ్వరం గడ్డపైన ఎగిరేది గులాబీ జెండానే అన్నారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తనను అధిక మెజార్టీతో గెలిపిస్తాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, రైతు బంధు, రైతుబీమా, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణతో పాటు పలు సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీని మూడోసారి గెలిపిస్తాయని ఆమె పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో బాకృష్ణ, అంజయ్య, రమేష్, రామచంద్రయ్య, నర్సింహ, రామయ్య, బాల్‌రాజ్, మల్లేష్, గణేష్, సుధాకర్, సుమన్, అష్రఫ్, రబ్బానీ, అరవింద్, శేఖర్, శ్రీనివాస్, మల్లేష్, పర్వతాలు, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు హన్మగళ్ల చంద్రయ్య, మండల అధ్యక్షుడు రాజునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి గౌడ్, పెండ్యాల ఉపసర్పంచ్ గౌస్, నాయకులు అశోక్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, షరీఫ్ పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యతోనే ఉత్తమ ఫలితాలు: పీడీఎస్‌యూ


పీడీఎస్‌యూ జెండావిష్కరణలో పాల్గొన్న పరశురామ్ తదితరులు

మలక్‌పేట: శాస్త్రీయ విద్య సాధనే లక్ష్యంగా పీడీఎస్‌యూ ముందుకు సాగుతోందని రాష్ట్ర అధ్యక్షుడు మామిడికాయల పరశురామ్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం దిల్‌సుఖ్‌నగర్ సాకేత డిగ్రీ కాలేజీలో పీడీఎస్‌యూ 49వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బిగి పిడికిలి జెండా ఎగురువేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తామని, విద్యార్థులను ప్రగతిశీల ఆలోచనల వైపు నడిపించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ కోసం 13 లక్షల మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంద నవీన్, పొడపంగి నాగరాజు, నాయకులు రవీందర్, కీర్తి, శ్యామ్ సమీర్, మమత వైష్ణవీ, ప్రసాద్, వెంకటేష్, పవిత్ర, సునీల్ పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే రైతు రుణాలు

- తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రమేష్
- నాగిరెడ్డిపల్లిలో నాబార్డ్‌తో కలిసి ఆర్థిక అక్షరాస్యతపై సదస్సు


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

మహేశ్వరం: తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రైతులకు తక్కువ వడ్డీకే పంట రుణాలు అందిస్తున్నామని మహేశ్వరం తెలంగాణ గ్రామీణ బ్యాంకు బ్రాంచి మేనేజర్ రమేష్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో ఆ బ్యాంకు, నాబార్డ్ వారి సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ.. తెలంగాణ గ్రామీణ బ్యాంకు రైతులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు 7 శాతానికే పంట రుణాలను అందిస్తున్నామని, సంవత్సరం లోపు తిరిగి చెల్లిస్తే 3 శాతం వడ్డీ తిరిగి వస్తుందన్నారు. రైతు కేవలం 4శాతం వడ్డీ మాత్రమే చెల్లించాల్సి వస్తుందన్నారు. మొబైల్ బ్యాంకింగ్, రూపే కార్డు ఉపయోగాలు, పీఎంఎస్‌బీవై స్కీం ద్వారా కేవలం రూ.20కే రూ.2లక్షల ప్రమాద బీమా, పీఎంజేజేవై స్కీం ద్వారా రూ.436కే రూ.2లక్షల జీవిత బీమా లభిస్తుందన్నారు. రైతులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మనోహర్, ఎంపీటీసీ రమేష్, బ్యాంకు అధికారులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

ఎల్‌బీనగర్: కాలనీలో మౌలిక వసతులు కల్పించి సమస్యలు లేకుండా చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో సర్వే నెంబర్ 33, 59 నివాసితుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గురువారం వారు కార్పొరేటర్ లచ్చిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశాను ఆయను సన్మానించి కాలనీ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. ప్రతి సమస్య పరిష్కారమయ్యేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో కాలనీ అధ్యక్షుడు జగన్ రెడ్డి, శివారెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదంగా వీఎంహోం

- రూ.12 కోట్లతో కొత్త సొబగులు
- డిజిటల్ క్లాస్ రూమ్‌లు, గార్డెనింగ్


పూలమొక్కలతో సుందరంగా తీర్చిన పార్కు



విక్టోరియా మెమోరియల్ హోం

హుడాకాంప్లెక్స్: చారిత్రక విక్టోరియా మెమోరియల్ (వీఎం) స్కూల్ ప్రాంగణం ఆహ్లాదకరంగా తయారైంది. ఒకవైపు శిథిలావస్థకు చేరిన ఈ పాఠశాల భవనాన్ని పునరుద్ధరిస్తూనే మరోవైపు స్కూలు ఆవరణను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. గార్డెన్‌ను రకరకాల పూలమొక్కలతో తీర్చిదిద్దారు. డిజిటల్ క్లాస్‌రూంలను సిద్ధం చేశారు.

50వేల మందికి ఆశ్రయం

విక్టోరియా మహారాణి జ్ఞాపకార్థం సరూర్‌నగర్ మండల కేంద్రంలో సుమారు 73.3 ఎకరాల విస్తీర్ణంలో 1901లో రెండు అంతస్తులతో కూడిన భవనం (వీఎంహోం) నిర్మించారు. ఇది 1903లో అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ 1వ తరగతి నుంచి ఎస్ఎస్‌సీ వరకు ఉచితంగా విద్యను అందించడంతో పాటు ఆశ్రయం ఇస్తున్నారు. ఇలా ఇప్పటివరకు ఇక్కడ సుమారు 50వేల మందికి పైగా అనాథలు ఆశ్రయం పొందారు. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. భయాందోళనతో విద్యార్థులు ఇక్కడ ఉండేందుకు జంకుతున్నారు.

వడివడిగా పనులు

వారసత్వ జాబితాలో చోటు దక్కించుకున్న ఈ చారిత్రక భవనాన్ని కాపాడుకోవాలని పురావస్తు శాఖ నిర్ణయించింది. ఈ మేరకు పునరుద్ధరణ పనుల కోసం ప్రభుత్వానికి లేఖ రాసింది. దీంతో హెచ్ఎండీఏ రూ.8 కోట్లు కేటాయించగా, హోం నిధులు మరో రూ.4 కోట్లు పునరుద్ధరణ పనులకు వెచ్చించాలని నిర్ణయించారు. దంగు సున్నంతోనూ మరమ్మతు పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే పనులు ప్రారంభించగా, కీలక సివిల్ వర్క్స్ సంబంధించిన టెండర్ ప్రక్రియ కూడా తుదిదశకు చేరుకుంది. త్వరలోనే ఈ పనులు పూర్తికానున్నాయి. అంతేకాదు అనాథ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబుద్ధులు నేర్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇప్పటికే రూ.18 లక్షల వ్యయంతో అత్యాధునిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. జిమ్, గార్డెన్ కోసం మరో రూ.56 లక్షలు వెచ్చించ డం జరిగింది. రూ.7 లక్షలతో డిజిటల్ క్లాస్ రూమ్‌లను తీర్చిదిద్దింది. ఇక్కడి గ్రంథాలయంలో సుమా రు పదివేల పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

కార్పొరేట్ విద్య అందిస్తున్నాం



అనాథ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబుద్ధులు నేర్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.18 లక్షల వ్యయంతో అత్యాధునిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. జిమ్, గార్డెన్ కోసం మరో రూ.56 లక్షలు, రూ.7 లక్షలతో డిజిటల్ క్లాస్ రూమ్‌లను తీర్చిదిద్దింది. ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి కార్పొరేట్ విద్యను అందిస్తున్నాం.

– ప్రభుదాస్, ప్రిన్సిపాల్, వీఎంహోం